క్లుప్తంగా

'ఉగాది' సుఖ సంతోషాలతో జరుపుకోవాలి


బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు తెలుగు సంవత్సర ఉగాది పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ తెలుగు సంవత్సరం నుంచి ప్రజలందరూ ఆనందంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆకాంక్షించారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులోని అంకమ్మ ఆలయం వద్ద శనివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు ఈ పూజలకు హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుచ్చి వాహనంపై శ్రీవారు


అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవరులకు ఊయల సేవను నిర్వహించారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్ఠింపజేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయల సేవలో ఉత్సవ మూర్తులను భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా


శ్రీసిటీలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న చీఫ్ ఇంజినీరు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి చీఫ్ ఇంజినీర్ జానకిరాం వెల్లడించారు. శనివారం శ్రీసిటీని ఆయన సందర్శించారు. విద్యుత్ సరఫరా అంతరాయాన్ని అరికట్టి, మెరుగైన సరఫరా అందించాలని శ్రీసిటీలోని పరిశ్రమల అసోసియేషన్ చైర్మన్‌కు చేసిన అభ్యర్థన మేరకు సీఈ విచ్చేశారు. శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలలో విద్యుత్ సరఫరా, ఇతర సమస్యలను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.


'అమర'లో అత్యాధునిక ప్రయోగశాల ప్రారంభం


రక్త నిధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): అమర హాస్పిటల్ లో అత్యాధునిక రక్త నిధి కేంద్రం, సెంట్రల్ లేబొరేటరీ, స్టెమ్ సెల్, మాలిక్యులర్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రారంభించారు. అమర హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గౌరీనేని ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి అతిథులను సత్కరించారు. హాస్పిటల్ కన్సల్టెంట్స్ డాక్టర్లు వరుణ్ పాల్గొన్నారు.

కొత్త ఊసులు..కోటి ఆశలు

నేటి సమాజంలో ఆధునిక పోకడలను అనుసరించొద్దని చెప్పడంలేదు.. కానీ వారసత్వంగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించకూడదు. ప్రతి మనిషిలో మంచి, చెడు రెండూ ఉంటాయి. చెడు అలవాట్లు మనిషిని సోమరులుగా మార్చేస్తాయి..కానీ మంచిని అలవాటు చేసుకోవాలంటే కాస్త ఓపిక ఉండాలి.. చేయాలనే సంకల్పం ఉండి ఆచరిస్తే సమాజానికి.. భవిష్యత్తు తరాలకు మార్గదర్శనంగా నిలుస్తారు..ఈ కొత్త తెలుగు సంవత్సరం 'ఉగాది' నుంచే మంచి అలవాట్లు, విలువలు పాటించేందుకు ప్రయత్నించి చూద్దాం.మార్పునకు నడుం బిగిద్దాం.. నేడు ఉగాది సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.



- ఉగాది నుంచే మార్పునకు శ్రీకారం చుడుదాం
- సంస్కృతి, విలువలకు ప్రాధాన్యం ఇద్దాం
- మంచి విషయాలను ఆహ్వానిద్దాం..చెడును తరిమేద్దాం
- నేటి నుంచి తెలుగు సంవత్సరం ప్రారంభం

నారాయణవనం: ఆధునిక పోకడలతో సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం యువత మరిచిపోతూ విలువలను కోల్పోతోంది. చెడు అలవాట్లకు బానిసై, నైతిక బాధ్యతలను విస్మరిస్తున్నారు. ఏదో ఒక సందర్భంలో.. ఏదో ఒక విషయంపై నిర్ణయం తీసుకోవడం మనిషి నైజం. తెలుగు సంప్రదాయ, సంస్కృతుల విలువలు పెంచే ఉగాది నుంచి యువత చెడు అలవాట్లకు దూరమై మంచి నిర్ణయాలతో కొత్త తెలుగు సంవత్సరం నుంచి ఉన్నతమైన మార్గంలో పయనించేందుకు నడుం బిగిస్తే భావి తరాలకు వారధులవుతారు.

మద్యం ముంచేస్తోంది..

మద్యం, పొగ తాగడం నేటి యువతకు ఫ్యాషన్ అయిపోయింది. దీనికి తోడు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఈ దుర అలవాట్లతో ఆరోగ్యం పాడవటమే కాకుండా కుటుంబ పరువు, ప్రతిష్ఠ దెబ్బతిని బంగారు భవిష్యత్తు చేజేతులా నాశనం చేసుకుంటున్నామనే సత్యాన్ని యువత గుర్తించడం లేదు. కుటుంబ నేపథ్యం , ఆర్థిక పరిస్థితులను గుర్తించి సత్ ప్రవర్తనతో నడుచుకుంటే కుటుంబం, గ్రామం, దేశం గర్వించే స్థాయికి చేరుకోవడం నేటి యువతకు ఏమంత కష్టం కాదు. ఆ దిశగా ఈ తెలుగు సంవత్సరం నుంచే ఈ దురలవాట్లకు స్వస్తి పలికేందుకు నిర్ణయం తీసుకుంటే మంచిది.

హెల్మెట్ అవసరం ఎంతో..

ట్రెండ్ కోసం రేసింగ్ మోటార్ సైకిళ్లతో మితిమీరిన వేగానికి త్రుటిలో జరిగే ప్రమాదాలు సాధారణం అయిపోయాయి. యువత హెల్మెట్ ప్రాధాన్యం యువత గుర్తించడం లేదు. ట్రాఫిక్ పోలీసులు జరిమానా ఎందుకు వేస్తున్నారో ఆలోచించరు. ఒక్కసారి జరిమానా చెల్లిస్తే మరోసారి పొరబాటుకు అవకాశం ఉండదనే గొప్ప ఆలోచనతోనే కేంద్ర ప్రభుత్వం పోలీసు శాఖ ద్వారా కేసులు పెడుతున్నారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో నో హెల్మెట్–నో పెట్రోల్ నినాదానికి తెర లేచింది. ఎవరో చెప్పేగాని ఆచరించాలనే ఆలోచనల నుంచి యువత బయటపడాలి. రక్షణ కోసమైనా హెల్మెట్ ధరించడం అందరి బాధ్యతగా ఈ నిబంధనకు తెలుగు సంవత్సరం నుంచే శ్రీకారం చుట్టాలి.

సంప్రదాయంగా కనిపించడం..

యువత దుస్తులధారణ, కోడి ఈకలు పీకేసి, గోకి నట్లు కటింగ్ స్టైల్, గడ్డాలు పెంచుకోవడం మన సంప్రదాయం కాదు. ఎంత చదువుకున్నా.. డ్రెస్ కోడ్, లుకింగ్ మన విలువను పెంచే విధంగా ఉండాలి. ఇంటర్వ్యూకు వెళితే ధరించిన దుస్తులే మనపై మంచి అభిప్రాయాన్ని కలిగించాలి. తొలి చూపుతోనే ఆకట్టుకునేలా ఉండాలి. దుస్తులు ఇలానే.. వేసుకోవాలని చెప్పడం కాదు. తెలుగు సంప్రదాయానికి ప్రతిబింబించేలా ధరిస్తే మన సంస్కృతి విలువలు పెంచిన వారవుతారు. ఆలయాలకు వెలితే సంప్రదాయ దుస్తులే ధరించాలని ఎవరో చెప్పే అవసరం రాకూడదు. ఆ మార్పు ఇప్పటి నుంచే మనలో వచ్చే విధంగా కృషి చేద్దాం.

సామాజిక స్పృహ..

నేడు చాలా మందికి సామాజిక స్పృహ లేకపోవడం శోచనీయం. పాఠాల్లో చదువుకునే దుస్థితి నుంచి వాస్తవంలోకి రావాలి. తల్లిదండ్రులు తమ వారసత్వ విలువలను పిల్లలకు చెప్పడం లేదు. రోడ్డు ప్రమాదాలు, ఘటనలపై తమ వీడియోలకు సామాజిక మాధ్యమాల్లో లైక్స్, కామెంట్స్ చూసి మురిసిపోతున్నారు. సాయం చేసి అదే ప్రాణాన్ని నిలిపినప్పుడు కలిగే సంతృప్తి విలువ కట్టలేం.. అలాంటి సామాజిక స్పృహను నేటి యువత అలవరుచుకోవాలి. విదేశాల్లో రోడ్డు మీద చాక్లెట్ రేపర్‌ను బుడతడు తీసి పక్కనే చెత్తబుట్టలో వేస్తున్న వీడియోలను చూసి లైక్‌లు ఇస్తున్నారేగాని, మనకు వారసత్వంగా వస్తున్న సంస్కృతిని, సంప్రదాయాలను విస్మరిస్తున్నాం. అదే పాశ్చాత్య దేశాలు మన ఇతిహాసాలను, గ్రంథాలలోని మూలాలను పాటిస్తుంటే మనమేమో విస్మరిస్తున్నాం. ఉగాది పచ్చడి తినేస్తున్నామే తప్ప అందులోనే ఆరోగ్య రహస్యాన్ని మన పిల్లలకు తెలియజేయడంలో తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను యువత వంటపట్టించుకుని దీక్ష భూనితే విశ్వావసు ఉగాది నుంచే చెడు లక్షణాలను దూరం చేసుకుని, కుటుంబాలకు దగ్గరై, దేశానికి మేలు చేసిన వారవుతారు. రేపటి తరానికి మార్గదర్శకులవుతారు.

యోగా దినచర్యగా ..



పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి పెరిగిపోతోంది. సెమిస్టర్ ఫలితాలను మెరుగు పరచుకోవాలంటే మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని గుర్తించాను. రోజూ 5.30కు కాకుండా ఈ ఉగాది నుంచే 4 గంటలకే నిద్రలేచి ధ్యానం, వ్యాయాయం చేయాలని నిర్ణయం తీసుకున్నా. మారనున్న దిన చర్యతో నాకు నేను దృఢంగా మారి స్నేహితులనూ ప్రోత్సహిస్తా.

–అరుణ, బీటెక్ విద్యార్థిని

సామాజిక మాధ్యమాలకు దూరంగా..



కళాశాల అయ్యాక ఇంటికెళ్లాక రిలాక్స్ కోసం ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్ రీల్స్ చూస్తూ సమయం వృథా చేయకూడదని ఉగాది నుంచే నిర్ణయం తీసుకున్నా. అయిన వారితో సరదాగా కొద్దిసేపు గడిపినా.. ఒత్తిడి తగ్గించుకోవచ్చునని తెలుసుకున్నా. మొబైల్ ఫోన్‌కు కాస్త దూరంగా కుటుంబ సభ్యులకు దగ్గరగా ఉండి సంస్కృతి, సంప్రదాయాలను అలవాటు చేసుకుంటాను.

–రూపా చౌదరి, ఇంజినీరింగ్ విద్యార్థిని

ట్రెండింగ్ మాయకు బానిస కాకుండా..



మంచి భవిషత్తు కావాలంటే కొన్నింటికి దూరంగా ఉంటూ మరికొన్నింటికి దగ్గర కావాలని తెలిసింది. అలాగని అన్నింటికి దూరం కావాలని కాదు. ట్రెండింగ్ మాయకు బానిస కాకుండా కుటుంబానికి దగ్గరగా ఉంటూ సంప్రదాయాలు, సంస్కృతి విలువలను పెంచుకోవాలని నిర్ణయం తీసుకున్నా.

–ఉష, బీటెక్ విద్యార్థిని

నోటీస్ బోర్డు

నేడు ఉగాది కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి: విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో దూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వేదిక ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి తెలిపారు.

నేడు ఉగాది ఆస్థానం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశ్వావసూ ఉగాది ఆస్థానం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఉదయం నిత్యపూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5.30 గంటలకు ఆస్థాన మండలంలో పెద్దశేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నకు పట్టు వస్త్ర సమర్పణ అనంతరం సాయంత్రం 6.30 గంటల వరకు పంచాగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

శ్రీకాళహస్తి: హైకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్ జైలును శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ శనివారం సందర్శించారు. ముందుగా సబ్ జైల్లోని వంటశాల, స్టోర్ రూమును పరిశీలించారు. తర్వాత ఖైదీలను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ... ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీ తప్పక చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే బెయిల్ గురించి ఉచిత న్యాయం, చట్టాలపై అవగాహన కల్పించారు. ఏదైన సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పాస్టర్ల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీలో పాస్టర్లు , జేఏసీ సభ్యులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులకు తీరనిలోటని, పాస్టర్ మరణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని రేణిగుంట చర్చి పాస్టర్ల జేఏసీ ముక్తకంఠంతో డిమాండ్ చేసింది. రేణిగుంట పట్టణంలోని ప్రధాన చర్చిలు, క్రైస్తవ ప్రార్థన మందిరాల పాస్టర్లు, విశ్వాసకులు శనివారం పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ముందు నినాదాలు చేస్తూ ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి పాస్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జాన్ బాబు, జూలియన్ రాజు, సీపీఎం నాయకుడు హరినాథ్, రెవరెండ్ కె.టెన్సింగ్ విక్టర్, రెవరెండ్ సతీష్ , విజయ్ కుమార్, పాస్టర్లు డానియల్, రాజ్ కుమార్, సతీష్, నవీన్, శాంసన్, సుధాకర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరిస్తా


ఇఫ్తార్ విందులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: ముస్లింల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శనివారం సాయంత్రం వరదయ్యపాళెంలోని పెద్ద మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో ముస్లింలు షాదీఖానా నిర్మించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నిర్మల్, మాజీ మండల అధ్యక్షుడు జయచంద్ర నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు ఢిల్లీప్ రాయల్, జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్, ముస్లిం నాయకులు నవాబు, లతీఫ్, ఫిరోజ్ ఖాన్, మస్తాన్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నారాయణవనం: రసాయనాలు లేని ప్రకృతి పద్ధతులతో సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు అధికారులు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయంపై సమావేశాన్ని నిర్వహించారు. రసాయనాలతో భూక్షామంతో పాటు ప్రకృతి కాలుష్యానికి గురవుతుందని వ్యవసాయాధికారి శోభారాణి పేర్కొన్నారు. రసాయనాలు వాడని సాగుపై శ్రద్ధ చూపాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచడంలో సంఘమిత్రలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కీలకంగా వ్యవహరించాలని ఏపీఎం మమత సూచించారు. సమావేశంలో డ్వాక్రా మహిళలు, ప్రకృతి వ్యవసాయ ట్రైనీలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు


ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం ట్రాఫిక్‌లో చిక్కుకుంది. గ్యాస్ పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి రోడ్డుకు అడ్డంగా గోతులు తీయడంతో ట్రాఫిక్ వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నిత్యం వందల వాహనాలు వరదయ్యపాళెం మీదుగా పరిశ్రమలకు ఉద్యోగులు వెళ్తుంటారు. అంతటి కీలకమైన ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో చేపట్టాల్సిన పైపులైను పనులను పగలు చేపడుతుండడంతో రెండు రోజులుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వందల వాహనాలు బారులు తీరుతున్నాయి. పోలీసులు దృష్టి సారించి రాత్రివేళల్లో పనులు చేపట్టే విధంగా చూడాలని కోరుతున్నారు.

మండుటెండలో భక్తులు.. తివాచీపై వాహనాలు



మండు టెండలో చెప్పులు లేకుండా నడుస్తున్న భక్తులు, ఎర్రతివాచిపై కారు పార్కింగ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యం వేల మంది భక్తులు తరలివస్తుంటారు. వేసవి నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా సన్నిధి వీధిలో ఎర్ర తివాచీని ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఇదేం చోద్యమో కానీ భక్తులు చెప్పులు లేకుండా మండు టెండలో నడుస్తున్నారు. వారి కోసం ఏర్పాటు చేసిన ఎర్రతివాచీపై కార్లను పార్కింగ్ చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బపై అవగాహన


వారపు సంతలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని రేణిగుంట వారపు సంతలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వీలైనంత వరకు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మంచి నీళ్లు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్‌ఎస్ ద్రావణం వంటివి అధికంగా తీసుకోవాలని తెలిపారు. అలాగే మాంసాహారం తగ్గించి శాకాహారం అధికంగా తీసుకోవాలన్నారు. పుచ్చకాయలు, దోసకాయలు వంటి శరీరానికి చలువ చేసే పండ్లతో పాటు పండ్ల రసాలు తీసుకుంటే మంచిదన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, రామాంజనేయ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కామ రాజు, విశ్రాంత సీహెచ్‌ఓ కపావరమ్మ, ఆశాలత, ఉమా మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తరగతులు అయిదు.. గదులు నాలుగు

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నాలుగు గదుల్లో అయిదు తరగతులు నిర్వహిస్తున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు 207 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరు చాలీచాలని గదుల్లో చదువులు సాగిస్తున్నారు. గత ప్రభుత్వం ఆరు గదుల నిర్మాణం కోసం రూ. 50 లక్షలను మంజూరు చేసింది. నాడు–నేడు పథకంలో గదుల నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం రావడంతో పనులు ఆగిపోయాయి. నిర్మాణ పనులు పూర్తయితే గదుల కొరత తీరనుంది.

–బుచ్చినాయుడుకండ్రిగ

భద్రత ప్రశ్నార్థకం!

- వర్షాలకు కూలిన ప్రహరీలు
- ఇప్పటి వరకు చర్యలు శూన్యం
- మందుబాబులు, ఆకతాయిల బెడద
- పట్టించుకోని అధికారులు


మేజర్ పంచాయతీ కార్యాలయం వెనుక వైపు కూలిన ప్రహరీ


వరదయ్యపాళెం : కూలిపోయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ

వరదయ్యపాళెం: గతేడాది కురిసిన భారీ వర్షాలకు పలు ప్రభుత్వ కార్యాలయాలకు భద్రతగా ఉన్న ప్రహరీలు నేలకూలాయి. ఏడాది కావస్తున్నా ఆ ప్రాంతంలో నూతన ప్రహరీ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో సంబంధిత కార్యాలయాలకు రాత్రివేళల్లో భద్రత కరువు అవుతోంది. వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వేసిన ప్రహరీపై చెట్లు కూలి రెండు చోట్ల 25 మీటర్ల వరకు గోడ కూలింది. దీంతో కూలిన ప్రాంతం నుంచి పగలు పశువులు లోపలికి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆస్పత్రి సిబ్బంది వాపోతున్నారు. అలాగే రాత్రివేళల్లో మందుబాబులు, ఆకతాయిల బెడద అధికమవుతోంది. మందుబాబులు ఏకంగా ఆస్పత్రి పనివేళల తర్వాత మద్యం తాగి పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ఇలా..

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద గతేడాది కురిసిన వర్షాలకు 30 మీటర్ల మేరకు ప్రహరీ కూలింది. దీంతో ఈ కార్యాలయానికి భద్రత సమస్య తలెత్తింది. రాత్రివేళల్లో కార్యాలయ ప్రాంగణంలో చెత్త సేకరణకు వినియోగించే వాహనాలను అక్కడే ఉంచుతారు. అయితే వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. కార్యాలయానికి రాత్రివేళల్లో ముందు భాగంలో గేటుకు తాళం వేసినప్పటికీ ప్రహరీ కూలిన కారణంగా వెనుక వైపు నుంచి లోపకి వచ్చే అవకాశం ఉంది. ఇలా రెండు కార్యాలయాలకు భద్రత కరువైంది. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం



వర్షాల కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ రెండు చోట్ల ప్రహరీ కూలింది. ఈ ప్రాంతంలో నూతన ప్రహరీ నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదించాం. అయితే ఇప్పటి వరకు నిర్మాణం జరగలేదు. పేద ప్రజలకు వైద్యం చేపట్టే ఆస్పత్రిలో అనేక విలువైన సామగ్రి ఉంది. వీటికి భద్రత తప్పనిసరి. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న ప్రాంతంలో ప్రహరీ నిర్మించాల్సి ఉంది. –ఉదయ్‌కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ

నిర్మింపజేస్తాం



పంచాయతీ కార్యాలయానికి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన ప్రహరీ గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొంత మేరకు కూలిపోయింది. ఆ ప్రాంతంలో నూతన ప్రహరీ నిర్మాణం కోసం ఇటీవల జరిగిన పంచాయతీ అభివృద్ధి సమావేశంలో ప్రస్తావించాం. పాలక వర్గం ప్రహరీ నిర్మాణానికి సానుకూలంగా స్పందించారు. త్వరలో నిర్మాణం చేపడుతాం.

– బసిరెడ్డి, ఈఓ, వరదయ్యపాళెం పంచాయతీ